# సీజనల్ వ్యాధులపై యుద్ధం

- జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- వ్యాధులు వ్యాప్తి చెందకుండా యాక్షన్ ప్లాన్
- 24 గంటల అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లు
- ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు
- జిల్లావ్యాప్తంగా ఫీవర్ సర్వే ప్రారంభం
- ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు
- ఒక్క కేసును గుర్తించినా చుట్టూ 50 ఇండ్లలో పరీక్షలు
- ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు.. మందులు


ఆలేరు మండలంలోని షారాజీపేటలో జ్వర సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : వాతావరణంలో పరిస్థితులు మారుతున్నప్పుడు సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు విజృంభిస్తాయి. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. కొన్ని సందర్భాల్లో నిర్లక్ష్యమే పెద్దదిగా మారుతుంది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ రోగాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఇవి 24గంటల పాటు పనిచేయనున్నాయి. అదేవిధంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సైతం ఏర్పాటు చేశారు. ఇది ఎప్పటికప్పుడు అలెర్ట్‌గా ఉండి, చర్యలకు ఉపక్రమిస్తుంది. మెడికల్ అధికారులు, పారా మెడికల్ సిబ్బంది కచ్చితంగా తమ హెడ్ క్వార్టర్లలోనే ఉండాలని ఆదేశాలు జారీ చేయడంతోపాటు సెలవులను రద్దు చేశారు. అయితే.. అన్ని జ్వరాలు డెంగీ, మలేరియా కాదని, ప్రజలు ఆందోళన చెందవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

### ఫీవర్ సర్వే షురూ..

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు జిల్లాలో శనివారం ఫీవర్ సర్వేను ప్రారంభించారు. ఆశ కార్యకర్తులు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీల్లో ఉండే సిబ్బందితో కలిసి జ్వర సర్వే చేపడుతున్నారు. వారు గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే వారం పాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సర్వేలో ఎలాంటి లక్షణాలు తేలినా వైద్యులు వెంటనే అప్రమత్తం కానున్నారు. ఏదైనా గ్రామంలో డెంగీ, మలేరియా వంటి తీవ్రమైన కేసులు నమోదైతే.. సదరు రోగి చుట్టూ ఉన్న 50 ఇండ్లల్లో సర్వే చేపట్టనున్నారు. పరీక్షల్లో పాజిటివ్‌గా తేలితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు.

### అందుబాటులో మందులు..

వ్యాధుల నేపథ్యంలో ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంది. ఇప్పటికే పీహెచ్‌సీల్లో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నది. అదే విధంగా అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచింది. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు దాదాపు లక్ష ఓఆర్ఎస్ ప్యాకెట్లు, క్లోరిన్ టాబ్లెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, డిస్ ఇన్ఫెక్టెన్స్, ఎమెర్జెన్సీ మెడిసిన్‌ను సరఫరా చేసింది. మలేరియా కేసులను గుర్తించడానికి జిల్లాలో 7500 ఆర్డీటీ కిట్లు అందుబాటులో ఉంచారు.

### వివిధ శాఖల సమన్వయంతో ముందుకు..

సీజనల్ వ్యాధుల నివారణలో వైద్యశాఖతోపాటు ఇతర శాఖలను కూడా ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. వైద్య, ఆరోగ్య, మున్సిపల్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. జిల్లా స్థాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిల్లో అన్ని సంబంధిత శాఖలతో కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత.. మరుగుదొడ్ల వినియోగం, నులి పురుగుల నిర్మూలన, బహిరంగ మల విసర్జనపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో విద్యార్థులు, టీచర్లు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయనున్నారు. దోమల ఉత్పత్తి స్థలాల గుర్తింపు, లార్వా వ్యతిరేక కెమికల్స్‌ను పిచికారీ చేయడం వంటి చర్యలు చేపట్టనున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. దోమలు ఉండకుండా ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేస్తున్నారు.

### డెంగీ నివారణకు ప్రత్యేక టీమ్

డెంగీ నివారణకు జిల్లా అధికారులు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఇందులో జిల్లా మలేరియా అధికారి, జిల్లా సహాయ మలేరియా అధికారి, ముగ్గురు సబ్ యూనియన్ ఆఫీసర్లు ఉన్నారు. వీరు ఎప్పటికప్పుడు జిల్లాలో డెంగీపై అలెర్ట్ చేస్తుంటారు. కేసు నమోదైన వెంటనే సదరు గ్రామానికి చేరుకుంటారు. పాజిటివ్ వచ్చిన ఇంటిని పూర్తిగా పరీక్షిస్తారు. కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇంట్లో పైరిత్రం స్ప్రే చేయిస్తారు. చుట్టుపక్కల సుమారు 50ఇండ్లల్లో ఉంటున్న వారికి డెంగీ పరీక్షలు చేస్తారు. ఏమైనా అనుమానాలు ఉంటే సీరంను హైదరాబాద్‌కు పంపిస్తారు.

### 24గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం



సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఫీవర్ సర్వే ప్రారంభించాం. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. 24గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. జ్వరం బాగా వచ్చినవారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. చికిత్స సమయంలో రోగులు జాగ్రత్తగా ఉండాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

– మల్లికార్జునరావు, డీఎంహెచ్ఓ


చేనేత సహకార సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## నేత కార్మికులను ఆదుకున్న ఘనత బీఆర్ఎస్‌దే

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు, సెప్టెంబర్ 30 : నేత కార్మికులను ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు జూలూరు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన చండూరు చేనేత సహకార సంఘం 61వ సాధారణ మహాసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జియో ట్యాగ్ కలిగి ఉన్న ప్రతి నేత కార్మికుడికి చేనేత మిత్ర పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి నెలా రూ,3 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. చేనేత బీమా ప్రవేశ పెట్టిన ఘనత సీఎం కేసీఆర్ దక్కుతుందన్నారు. చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం 5శాతం జీఎస్టీ తగ్గించే వరకు పోరాటం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలకు అండగా ఉండాలని కోరారు. పేటెంట్ కలిగిన వస్త్రాలను ప్రింటింగ్ చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. చేనేత చీరెలను కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు వర్తింపజేసేలా కృషి చేయనున్నట్లు అలాగే గృహలక్ష్మి పథకంలో చేనేత కార్మికులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో చండూరు అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. రూ.571కోట్ల నిధులు నియోజక వర్గానికి మంజూరు చేయించినట్లు తెలిపారు. కొద్ది రోజుల్లో మరో మిర్యాలగూడగా చండూరు మండలం మారబోతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళావెంకన్న, కౌన్సిలర్లు కోడి వెంకన్న, రాధికాశ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపోలు నారాయణ, జాతీయ అవార్డు గ్రహీత యాదగిరి పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట

మునుగోడు : గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకరెడ్డి అన్నారు. మండలంలోని నల్లగొండ అడ్డరోడ్డు నుంచి గుండ్లోరిగూడెం, కల్వలపల్లి నుంచి కాశవారిగూడెం, పులిపలుపుల నుంచి ఊకొండి క్రాస్ రోడ్డు, నార్కట్‌పల్లి క్రాస్ రోడ్డు నుంచి గంగోరిగూడెం, అదేవిధంగా గుండ్లోరిగూడెం, గంగోరిగూడెంలోని గ్రామ పంచాయతీలకు, ఊకొండి గ్రామంలోని సీసీ రోడ్డుకు, డ్రైనేజీకి, సింగారంలో సీసీ రోడ్డుకు, డ్రైనేజీకి శనివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, ఎంపీటీసీలు ఈద నిర్మల, వట్టపాక వెంకటమ్మ, బొల్లగ్రి లింగయ్య, పోలగోని విజయలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచులు పల్లెగోని యాదయ్య, పి.మారయ్య, పానుగంటి పారజాత, గుర్రాల పరమేశ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుషోత్తంరెడ్డి, పోలగోని సైదులు గౌడ్, ఈద శరత్‌బాబు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, పగిళ్ల సతీశ్ పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మునుగోడు, చండూరు, గటుప్పల మండలాలకు 81మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను క్యాపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. 58జీఓ కింద మంజూరైన మునుగోడు, చండూరు మండలాలకు చెందిన 47మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునుగోడు, చండూరు ఎంపీపీలు కర్నాటి స్వామియాదవ్, పల్లె కల్యాణి, చండూరు జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, చండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళావెంకన్న, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు కోడి వెంకన్న, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు అనిల్ రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.


చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

## చౌటుప్పల్‌లో స్వచ్ఛతా హీ సేవ

చౌటుప్పల్, సెప్టెంబర్ 30 : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు ప్రాథమిక పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ బొడిగె అరుణాబాలకృష్ణాగౌడ్, పుష్పలత, హైమావతి, బొంగు వెంకటేశ్ పాల్గొన్నారు.

### అవగాహన ర్యాలీ..

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో స్థానిక నలంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ తీశారు. ఆనంతరం శ్రమదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.విష్ణుకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రజక సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా తిరుమలేశ్

యాదగిరిగుట్ట, సెప్టెంబర్30 : రజక సంఘం నియోజకవర్గ తాత్కాలిక కమిటీని శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సట్టు తిరమలేశ్, జాయింట్ కన్వీనర్‌గా సింగారం ఉప్పలయ్య, ప్రచార కార్యదర్శిగా గంధమల్ల కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకుడు మామిడాల నర్సింహులు, నాయకులు ఎలిమినేటి బుచ్చయ్య, జూపెల్లి నర్సింహులు, గిరి రాజు వెంకటయ్య, మొగిలి ఇస్తారి, జూపల్లి నగేశ్, జంగయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఆర్పీలకు వేతనాల పెంపు హర్షణీయం

- మున్సిపల్ చైర్మన్ రాజు
- సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, సెప్టెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ రిసోర్స్ పర్సన్లకు గౌరవ వేతనం తాజాగా మరో రూ.2 వేలు పెంచడం హర్షణీయమని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండీ బాబాషరీఫ్, బండమీది మల్లేశ్, ఆర్పీలు కానూరి శోభన, జ్యోతి, హైమావతి,లక్ష్మి, కవిత, కల్పన, రమాదేవి, హేమలత, మల్లమ్మ, సుగుణ పాల్గొన్నారు.